కథానిక

అంతరాలు

"వల్లపురెడ్డి"

బజార్లో కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్న పొరుగూరి బాలయ్యను చూసి బుచ్చిరాజు అకస్మాత్తుగా తలదించేసుకుని చరచరా వెళ్ళిపోయాడు. అతని పోకడను బాలయ్య గమనించనే లేదు. గమనించినా అతను తలవంచుకుని వెళుతున్నాడెందుకో అని సందేహించేవాడు కాదు. ఒకవేళ అలాంటి సందేహం కలిగినప్పటికీ అతని తలవంపునకు కారణం తను అక్కడ అగుపడటమే అని మాత్రం తెలిసికోలేక పోయేవాడే. ఎందుకంటే బుచ్చిరాజును బాలయ్య అంతగా ఎరుగడు. కారణం: బుచ్చిరాజులాగ తాను గొప్పగా చదువుకున్నవాడూ కాదు; దర్జాకలవాడూ కాదు. బిన్నీ షర్టు, ఫ్లాస్కో పంచె, మీద అందంగా కప్పుతున్న పెద్దాపురం సిల్కు కండువా, చెప్పులు. అంతేగాక అతను సహజంగా అంతగాడు; నీటుగా క్రాఫు దువ్వి పరిశుభ్రంగా ఉన్నాడు. బాలయ్య వీటికన్నిటికీ దూరంగా ఉన్నాడు. అతనిమీద చిరిగి పేలికలయిపోయి చెమటలో పలుమార్లు తడిసి, ఎండి బిగుసుకుపోయిన ఒక తలపాగా, చాలీచాలని పాతపంచెకు మినహా మరేమీ లేవు. ఇక అందచందాలు పరిశుభ్రత కావాలంటే అతని దగ్గర వెతికినా దొరకవు. ఇవన్నీ వ్యక్తిగత విషయాలే అయినా, సామాజికంగా కూడ ఇరువురికీ ఏవిధమైన కలయికలూ లేవు ఒకే ఊరివాళ్లు కాకపోవటంవల్ల. ప్రాపంచిక తారతమ్యాలను దాటింతరువాత, వీ రిరువురినీ ముడివేసి సమానత్వం కల్పించేది ఒక్క సృష్టిమాత్రమే!

బుచ్చిరాజు బాలయ్య జీవితంలో ఒకక్షణం తటస్థపడి మరుగుపడిపోయిన అసంఖ్యాకుల్లో ఒకడే కానీ నిత్యమూ కలిసేవాడుమాత్రం కాదు. అయితేమరి బాలయ్యను చూసీ చూట్టంతోనే ప్రధానాంగాన్ని వంచుకుని వెళ్ళిపోవటానికి కారణం?

నిజానికి అతను తన మస్తకాన్ని బుద్ధిపూర్వకంగా వంచుకోలేదు. బాలయ్యను చూట్టంతోనే దానంతటదే అప్రయత్నంగా వంగిపోయింది. అతను చదువుకున్నవాడు; న్యాయాన్యాయాలను నలుగురికి తెలియజెప్పగల మనిషి. అభ్యుదయ రచయిత; సంఘసంస్కరణ ప్రధానాశయంగా పెట్టుకున్న వ్యక్తి. వీటన్నిటికి తోడు అతనిలో ఆత్మను పరిశీలించుకునే సుగుణమొకటుంది. ఎవరేనా నీతిబాహ్యంగా ప్రవర్తించారంటే అతనికి కంటగింపు. ఎప్పుడైనా పొరపాటున తనే అలా ప్రవర్తిస్తే ఎనలేనిబాధ ననుభవిస్తాడు. తనమీద ఉన్న సద్భావంకొద్దీ ఇతరులు తనతప్పిదాన్ని వ్రేలెట్టి చూపకపోయినా తనకుతానే పశ్చాత్తాప పడుతాడు. అతన్లో ఉన్న ఈ గుణమే ఎన్నడో తను చేసిన పొరపాటుకు శిక్షగా ఈ నాడు తలవంచేలా జేసింది.

మూడేళ్ల క్రితం సంగతి. వేసవి సెలవుల్లో గోవిందూ, దశరథం బుచ్చిరాజును ఓ మారు చూసి వెడదామని వచ్చారు. ఆ నాడు ఏవో సాంసారిక క్లిష్టపరిస్థితులు ఎదురు తగలటం వల్ల బుచ్చిరాజు మనస్సేమీ బావుండలేదు. వచ్చిన మిత్రద్వయంతో ఎప్పటిలా మనసువిప్పి మాట్లాడలేదు. సరికదా, కనీసం పల్లెత్తుమాటైనా పల్కకుండా మౌనధారి అయ్యాడు. గోవిందు కొంచెం మితభాషి. కాని దశరథం ఓపట్టాన వదిలాడు కాదు. ఎలాగైనా మాట్లాడించాలని ప్రయత్నం చేశాడు. అయినా అతడు మాట్లాడకపోవడమటుంచి, దశరథ హాస్యభరితంగా సాగించిన ధోరణి అనవసర ప్రసంగంగా తోచి విసుక్కున్నాడు. బుచ్చిరాజు ఎందుకంత విచారిస్తున్నాడో మిత్రులకి తెలుసు. తెలిసే అతణ్ణి విచారంలోంచి బయటికీడ్వాలని ప్రయత్నించారు. కాని ప్రయత్నాలన్నీ విఫలమయ్యేసరికి "మేం వెళ్ళిపోమా?" అనడిగారు.

వెళ్ళొద్దని ప్రాధేయపడతాడని వారి ఆంతరంగికాభిప్రాయం.

"వెళ్లేవారిని అడ్డుకుని అడుక్కునేవా లెవరూ లేరిక్కడ" సమాధానంలో తీవ్రత కన్పించినా లోలోపల వారు వెళ్ళటమంటే అయిష్టంగానే ఉంది.

"మాట్లాడకపోతే మానె. కనీసం అలా పొలాలవైపు వెళ్ళివద్దాం పద" అని లాగారు. తనకేమో బయటికి వెళ్ళటానిక్కూడా మనస్సొప్పటం లేదు. కాని వాళ్ళ కోరికను ఈమాత్రమైనా సాగనీయకపోతే వారు వెళ్ళటం తథ్యం అని తోచేసరికి వెళ్ళక తప్పలేదు. పొలాలవైపు బయల్దేరిన వారు మెల్లిగా మామిడితోటవైపు దారి తీశారు, కాస్సేపు అలా సరదాగా తిరిగి నాలుగు మామిడిపళ్ళు కొనుక్కుని తినివద్దామని. ఈ కోరికను గూడా కాదనకలేకపోయాడు. మనిషిలో సహజంగా వున్న లోపం ఇదొక్కటే. కటువుగా ప్రవర్తిస్తున్నప్పుడు చర్యలన్నీ ఒకదానికంటే మరొకటి కటువుగా వుంటాయి. కాని దానిలోనే ఏ కొంచం నమ్రత ప్రవేశించినా అదే నమ్రత మరో నమ్రతకు దారితీస్తుంది. కటువుతనంగాని, నమ్రతగాని మనిషిలో పరిమితంగాఉంటే మంచిదే. కాని ఇవెప్పుడూ హద్దుల్లో వుండవు. ఇవి కల్లు సారావంటి మత్తు పదార్థాల వంటివి. వీటిని ఒక పరిమితిలో ఉపయోగిస్తున్నంతవరకు మనిషికి ఏ భయమూ అక్కర్లేదు. కాని ఒక గ్లాసు కల్లు మరో గ్లాసుకు నాంది. బుచ్చిరాజు మిత్రుల ఒక కోరికను చెల్లించాక మరో కోరికను చెల్లించకుండా ఉండలేకపోయాడు.

తోట ఆ వూరికి మైలుదూరాన్న మరో ఊరి జాగీర్దారుది. దాన్ని ప్రతి సంవత్సరమూ జాలరి వాళ్ళు కౌలుకు తీసుకుంటూరు. దానిలో పలు రకాల మామిళ్ళున్నాయి. విరివిగా కాస్తాయి. జాలరివాళ్ళు బాగాలాభం తీస్తుంటారు. కౌలుదార్లు బుచ్చిరాజు గ్రామస్థులే కావటంచేత పరిచయాన్ని బట్టి కొంచం చౌకగా మంచిపళ్ళు ఇస్తారు. అందుచేత ప్రతి సంవత్సరమూ మిత్రులెవరైనా వస్తే ఆ తోటకే తీసికెళ్ళటం పరిపాటి.

గేటు తెరచుకుని తోటలో కెళ్ళారు. పది గజాలదూరం వెళ్ళారో లేదో, దూరంనుంచి "ఎవరయ్యా...యాడికి?" అని కేక వినపడింది. ఆ కేక తమను ఉద్దేశించే అయినప్పటికీ అంటటి గట్టి కేకకుతగ్గ సమాధానం ఇచ్చే గొంతు ఎవ్వరికీ లేకపోవటంవల్ల ఇంకా ముందుకు వెళ్ళారు. ఒక మనిషి పరుగెత్తుకుంటూ వచ్చి "యాడికయ్యా, కేకేస్తూంటే యిన్పించుకోకుండానే ఒస్తున్నారు?" అని ప్రశ్నించాడు.

"ఆఁ, మరేమీలేదు; కొంచం తోట చూసి వెడదామని వచ్చాం. అంతే" అన్నాడు గోవిందు. నెమ్మదిగా మరో నాలుగైదడుగులు ముందుకు నడిచారు మామిడి అంట్లను పరికిస్తూ.

"ఏముంది సూట్టానికి? యెల్లిపొండయ్యా, దొరోల్లెవరైనా సూస్తే నాకు మాటొస్తది" ముందుకు నడిచివెడుతున్న వారి ననుసరిస్తూ "సెప్తుంటె యిన్పడదయ్యా మీకు?" అన్నాడు మొదటి ధోరణిలోనే. చెబుతూన్న మాటలు తమకు గాదన్నట్లుగా ముందుకు నడుస్తూంది మిత్రత్రయం. బుచ్చిరాజు పాదాలు ముందుకు వెళ్ళటానికి ఒప్పుకోలేదు. మిత్రుల ముఖంలోకి చూశాడు వెడదామన్నట్లు.

మిత్రుని ముఖకవళికల్ని ఖాతరు చెయ్యకుండానే గోవిందు ప్రారంభించాడు. "ఊరికే చూట్టానికి కాదు; పళ్ళు కొనుక్కెళ్ళాలని వచ్చాం"

"కొంటమూ, అమ్మటమూ ఇక్కడేమీలేదు. వచ్చిందారినే మళ్లండి" అంటూ త్వరపెట్టాడు.

"ఏటేటా మేమిక్కడే కొనుక్కుని తిని పోతూంటాం. ఇదేమిటి ఈ ఏడు ఇట్లంటావ్? ఇంకెవరూ లేరా గుత్తాకు తీస్తున్న వాళ్ళు?" చుట్టూరా కలియచూశాడు. గోవిందు. "తోట బొత్తిగా పండనట్లు దే?"

"ఏదీ చెట్లకు ఈ యేడంతా నీళ్లే పారనివ్వ లేదు. పండమంటే ఎట్లా పండుతాయయ్యా?" అతడు మాటల్లోకి దిగాడు. మొదటిలాగా కోప పూరితంగా లేవు మాటలు "ఎందుకూ? ఇంత పెద్ద బావి ఉండనేవుంది. నీరెందుకు పట్టలేదు తోటకి?" అనడిగాడు గోవిందు.

అతఁడు ఒక పదిగజాలు ముందుకువెళ్ళి ఒక చెట్టుక్రింద చతికిలపడ్డాడు. "ఉంది బావివుంది; ఇంజన్లూ వున్నయ్. కాని ఏదో ఆమధ్య చిన్నదొర

పెద్దోరా కొంచం కీచులాడుకున్నారు. పట్నం నుంచి పెద్దోర నెలకీ, రెన్నెల్లకూ వచ్చి తోటమీ దొచ్చిన డబ్బులన్నీ తీసికెళ్లి కర్చుపెడ్తాంటే చిందొర సూడ్లేక ఇంజన్లు పీకించి బంగలాలో పడేసారు. మమ్మల్ని నీరెట్టొద్దన్నారు. మాకేం? జీతగాల్లం సెప్పినంత సేసేవాళ్ళం. ఈయేడు ఏదో ఈమూలొకటి, ఆమధ్య రెండు, ఆపక్కన ఓనాలుగు చెట్లు; అంతాకలసి ఒక ఏడెనిమిది గల్లయి పండినయి. వాటికి నన్ను కాపలా ఉంచారు. అవికూడా మొన్నరేగిన గాలులకి అన్నీ రాలిపోయినయి.ఇంకా కొంచం మిగిల్నయి."

"మరి రాలిన కాయలన్నీ ఏంజేశారు?" మధ్య లోనే ప్రశ్న.

"ఏమో, రెండుమూడు గంపల కాయలకు రాలినయ్. అన్నీ ఏరికెల్లి బంగలాలో పోసాను. ఏం జేసుకున్నారో ఎవరికి తెలుసు? వాటితోని మాకేంపని? ఒక్కటిగూడా ముట్టుకోలా నేను..."

"అయితే నువ్వు దొరలదగ్గర జీతం చేస్తున్నా వన్నమాట. ఎన్నాళ్ళనుంచి? ఎంతిస్తారు జీతం?" విషయం మార్చాడు గోవిందు.

"పదేళ్ళ పిల్లగాడి దగ్గర్నుంచి ఈల్ల దగ్గరే వున్నా. ఇరవై ఏల్లయింది. యాడాదికి నూట యాభై గాడీలిస్తారు. తోటదగ్గర ఉండమంటే వుండాలి. అవుసరమొచ్చి దున్నటానికి కెల్లమంటే ఎల్లాలి. ఒక్క పనిగాదు. అన్ని పనులూ సెయ్యాలి. మొన్ననే సాలిచ్చుకుందామంటే, చిందొర ఉండీ, కాదు బాలయ్యా ఈ ఒక్కేడే ఎట్లాగో ఉండు. మధ్యలో మానేస్తే ఎట్లాగు? అని ఊరికే అడిగితే కాదన్లేక వున్నా. ఈ ఒక్కేడూ అయిపోతే ఇక మానుకుంటా ఉన్నంత వరకూ నాయంగా చెయ్యాలిగదా...", గోవిందు ముఖంలోకి చూశాడాయన. గోవిందు పరధ్యాన్నంగా వూకొడ్తున్నాడతని మాటలకు దశరథం మాత్రం శ్రద్ధంగా వింటున్నాడు.

దశరథం జేబులోంచి సిగరెట్టుడబ్బీ తీసి ఒకటి ముట్టించుకున్నాడు. డబ్బీ గోవిందుకిస్తూ అతని కొకటివ్వమని సైగచేశాడు. గోవిందు "నువు సిగరెట్టు కాల్చవూ?" అతన్నుద్దేశించి ప్రశ్నిస్తూ చేతిని ముందుకు పోనిచ్చాడు. "ఊహుం, నేం తాగను. నాకొద్దు." వైముఖ్యం, తత్తరపాటు వ్యక్తపరిచాడు - ముఖంలోనూ, చేష్టలోనూ.

"మరేంలేదు; తీసుకో బాలయ్యా మేం పండ్ల కొరకిస్తున్న లంచమనుకుంటున్నావా, ఏం? నువు పండ్లివ్వక పోయినా ఫరవాలేదు. తీసుకో." అన్నాడు దశరథం.

"పండ్లిచ్చినా, ఇయ్యకపోయినా నేను తాగనయ్యా. చుట్టతాగితే తీసుకోటానికేం. తాగనయ్యా అంటే..." అన్నాడు.

గోవిందు సిగరెట్టు డబ్బీని దశరథం కిచ్చాడు. "అయితే మరి ఇంతదూరంనుంచి వచ్చి తినకుండానే వెళ్ళాలా బాలయ్యా?" అన్నాడు. ఎక్కడలేని నిరాశ నిస్పృహ కనపరచాడు మాటల్లో.

"అఁ, ఎల్లాల్సిందే. నేనేం జెయ్యను? ఇదేం నాతోటా? ఏదో నాల్గుపండ్లివ్వటానికి? నేనివ్వనయ్యా నాకు మాటొస్తది."

"నీకు మాటొచ్చేట్లు చేస్తామా? ఇదుగో డబ్బు తీసుకుని నీకిష్టంవచ్చినన్ని—మూడో, నాల్గో—తెచ్చివ్వు తోట వెనకదారిగుండా వెడతాం. నీకేమీ మాట రానీములే దూరంగా వెళ్ళిపోతాం."

"ఊహుం, అదంతా ఏమీ పడదు. ఎల్లండి దొరలెవరైనా చూస్తే నన్ను దక్కనివ్వరు. తోటలో మనుషులు తిరిగితే సరి; నన్ను కుచ్చి కుచ్చి అడుగుడారు. ఎల్లండయ్యా ఎన్నిసార్లు చెప్పాలి?"

ఎంతసేపు మాట్లాడినా అతను తమదార్లో పడే సూచనలేమీ అగుపడలేదు. "అయితే, ఇంత దూరం వచ్చినందుకు బావిలో నీళ్ళయినా త్రాగి వెడదాం పదండి." అన్నాడు గోవిందు. ముగ్గురూ బావిదగ్గరికి దారితీశారు. కాని ఎవరూ నీళ్ల త్రాగనేలేదు. బుచ్చిరాజు మాత్రం బావిలోకి దిగి, నీళ్ళవాసన కొడ్తున్నందున బయటికొచ్చాడు. అతడూ వారివెనకాలే వెళ్ళాడు. బావిచుట్టూరా నాలుగైదు చెట్లు బాగాపండిఉన్నయి. వెళ్ళిన త్రిమూర్తులు ఏమైనాచేస్తారేమోననే అనుమానం చేత అతడు అక్కడే నిరీక్షిస్తూ నిల్చున్నాడు.

బుచ్చిరాజుకేమో అక్కడ నిల్చున్న ప్రతి క్షణం విసుగ్గా గడుస్తోంది. కాని గోవిందుమాత్రం తోటకాపరితో మాటలు ముగించటంలేదు. అప్పు

డప్పుడు దశరథం గూడా అగ్నికి వాయువులా తోడౌతున్నాడు. గోవిందు, అంట్లపెంపకాన్ని గురించి సంభాషణ మొదలెట్టాడు. మధ్యమధ్య గోవిందు డబ్బులు తీసుకుని పళ్ళివ్వమనటమూ, అతడు నిరాకరించటమూ జరుగుతూనే ఉంది. బుచ్చిరాజు అతని న్యాయబుద్ధికి, విశ్వాసానికి లోలోపల మెచ్చుకున్నాడు.

గోవిందు ఆఖరి ప్రయత్నం చేశాడు. జేబులోంచి ఒక రూపాయి నోటుతీసి అతని దగ్గరికి వెళ్ళి బలవంతంగా చేతిలో, అతడు వద్దువద్దంటుండగానే ఉంచి "ఇదిగో ఇది తీసుకుని నీ ఇష్టంవచ్చినన్ని పళ్ళుతీసుకొచ్చివ్వు. మేం ఇదే, ఈ వెనక దారిగుండా వెళ్ళిపోతాం. ఎవ్వరికీ ఈ విషయం తెలియనివ్వంలే. ఇంతదూరంవచ్చి ఊరికే ఎలా వెళ్ళాలి? తెచ్చివ్వు." వీలయినంత మృదువుగా చెప్పాడు.

ఆ దృశ్యం బుచ్చిరాజుకేమీ బాగనిపించలేదు. తోటమనిషి చేతిలోంచి నోటును జారవిడువలేక పోయాడు. అతనిలో ఎన్ని ఊహలు రేకెత్తినవో ఆ రూపాయివల్ల తన భార్యను ఒక రవికె తీసుకు రావచ్చుననుకున్నాడో, లేక చిన్నకొడుక్కి ఒక చొక్కా కుట్టించవచ్చు ననుకున్నాడో, లేక మూన్నాళ్ళకు సరిపోయే బత్తెం కొనవచ్చు ననెంచాడో, ...ఏమేమి ఊహించాడోగాని ముఖం మాత్రం ఒకవైపున ఏదో ఆశచేత జేవురించింది. మరోవైపు, యజమానిపట్ల విశ్వాసరాహిత్యంగా ప్రవర్తిస్తున్నాననే బాధచేతనేమో, కళ దగ్గింది. ఎట్టకేలకు అతను కాదనలేక పోయాడు. "మీరెంత చెప్పినా ఇనటంలేదు. నాకు మాటొస్తదని అప్పట్నుంచి చెబుతుంటే మీపట్టు మీదే. కచ్చితంగా మాట్లాడుదామంటే పెద్దకులపోళ్ళు ...సరే, ఆలాగండి." అంటూ తోటకు పూర్తిగా వెనక భాగానికి తీసుకువెళ్ళాడు వారిని. బాగా వెడల్పుగా పెరిగిన చెట్లమాటుకు వెళ్ళి నాలుగుపండ్లు తెంచి తీసుకుని పరుగెత్తుగొచ్చి వాళ్ళ చేతుల్లోపెట్టి, "ఇక వెళ్ళండి. నాకు భయమేస్తుంది. దూరంగా ఎళ్లిపొండి." అన్నాడు. అతను అపాదమస్తకమూ వణుకుతున్నాడు. అతని స్థితిచూచి బుచ్చిరాజుకు మనస్సు చివుక్కుమంది, అతనిమీద జాలి, కోపమూ కలిగినయి. డబ్బు ఆశచూపి అతడిని ఆ స్థితికి తెచ్చిన మిత్రులమీద పట్టలే ఆగ్రహం కలిగింది; కాని ఏమీ అనలేకపోయాడు.

తోటబయటికివెళ్ళి ఒకచోట కూర్చున్నారు. మిత్రులు గోవిందూ, దశరథం పళ్ళను పగుల కొట్టారు కత్తిఏమీలేకపోవటంవల్ల. బుచ్చిరాజుకు ఆ పళ్ళుతినటం సుతరామూ ఇష్టంలేదు. కాని మిత్రుల్ని సంతృప్తి పరచటానికి తినక తప్పలేదు; తరువాత గోవిందు ఒక పెద్ద ఉపన్యాసమిచ్చాడు. తను తోటకాపరి శీలానికి భంగకరంగా ప్రవర్తించలేదనీ, జాగీర్దార్లకు అన్నిపండ్లు అనవసరం కనుక ఒక విధంగా తోటవాడికి సహాయం జరిగిందీ, తమ కోరిక నెరవేరిందనీ.

సాయంత్రం ఇంటికి మరలి వస్తాంటే దశరథ అన్నాడు గోవిందుతో "ఏం గోవిందూ, తప్పు కుందామని చూస్తున్నావేమో, తోటవాణ్ణి డబ్బుతోమార్చి! ఇదో మన కవిగారు ఎక్కడైనా దెబ్బతీస్తారు. కొంచెం జాగ్రత. రేపోమాపో కథనో, గేయాన్నో వ్రాస్తారుచూడు." అని హెచ్చరించాడు నవ్వుతూ.

"రాసుకుంటే రాసుకో, కాని మా పేర్లతో డైరెక్టుగా మాత్రం డీల్ కావద్దు స్వామీ" అన్నాడు గోవిందు బుచ్చిరాజువైపు చూస్తూ. బుచ్చిరాజు పలక్కుండా గంభీరంగా నడుస్తున్నాడు.

మరునాడు ఉదయం మిత్రులు వెళ్ళిపోయారు. పోస్టుమాన్ ఉత్తరాలు తెచ్చి ఇచ్చాడు. ఒక కవరులో ఒకచెక్ గూడా వచ్చింది. ఎక్కడ్నుంచో అని ఆదుర్దాగా చూశాడు. ఒక ప్రముఖ పత్రికాధిపతి పంపాడు. ఉత్తరాలన్నీ చూస్తే అతనినుంచి ఒక ఉత్తరంగూడా వచ్చిఉంది. "ప్రత్యేక సారస్వత సంచిక వెలువరిస్తున్నాం. మీ రచన అవశ్యం కావాలి. పారితోషికంగా ఏభైరూపాయలు పంపుకుంటున్నాం." ఇవీ ఉత్తరంలోని మాటలు. ఏం చెయ్యాలో స్ఫురించలేదు బుచ్చిరాజుకు.

వాళ్ళ మాటను తీసివెయ్యలేక రచనైతే పంపాడు; కాని తరువాత చాలా బాధపడ్డాడు. అంతకు క్రిందటిరోజున జరిగిన బాలయ్య ఘట్టం జ్ఞప్తికొచ్చింది. అతనికీ తనకూ భేదమేమీ అగుపడలేదు. అవమానంతో కుచించుకు పోయాడు.

ఈ కారణంవల్లనే బుచ్చిరాజు బాలయ్యను చూసి తల దించుకున్నాడు. ఇప్పుడే కాక ఇంతకు మొదటగూడ ఎన్నో పర్యాయాలు బుచ్చిరాజుకు తటస్థపడ్డాడు. ఇతణ్ణిచూసి అతడు చలించలేదు. ఇతడే తలవాల్చి వెళ్ళిపోవాల్సి వచ్చింది. కారణం బుచ్చిరాజుకు తెలుసు. బాలయ్య తన ప్రవర్తనకు వణికిపోయింది క్షణ కాలం మాత్రమే ఆ ఘట్టం కాస్తా కళ్ళముందు నుంచి మాయమవగానే తనూ మర్చిపోయాడు. బుచ్చిరాజును ఈనాడతను గుర్తేపట్టడు. కాని బుచ్చిరాజు మాత్రం తన తప్పిదానికి ఈనాడు గూడా తలవంచుకుంటున్నాడు. బాలయ్యకూ, బుచ్చిరాజుకూ ఉన్న తేడా ఆత్మసంస్కారం లోనే.

త్వరత్వరగా ఇంటికివచ్చి బుచ్చిరాజు ఈజీ చైర్లో కూర్చున్నాడు. కాని అతని మనస్సు మనసులోలేదు. ఎందుకు తను అప్రయత్నంగా అలాంటి అవమానం ఫీలవుతాడు? బాలయ్య ఏనాడో మర్చిపోయినట్లుంది. కాని తననింత వరకూ పీడిస్తుందే ఆఘట్టం? తనూ, బాలయ్యమల్లే ఉంటే ఎంత బావుండును! 'ఛీ, ఛీ ఈ చదువూ, సంస్కారమూ లేకున్నా బావుండేది! అని మనసులో అనుకుంటూంటే వేడినిశ్వాసం ఒకటి వెలువడింది.

కథానిక

ఫలించిన పథకం

ఎస్. యం. సుభాని

ఆట్లుంచి వస్తున్న రాజారావు రౌండ్ గార్డెన్ లోని ఫౌంటెన్‌దగ్గర నిలబడివున్న విజయ లక్ష్మిని చూశాడు. అంతకు క్రితం చాలసార్లు చూశాడు, కాని పరిచయ మేర్పడిన తర్వాత ఇదే మొదటిసారిగా చూడటం. ఎప్పుడుచూసినా ఏదో విచారంతో బాధపడుతున్నట్లు కన్పిస్తుండేది. ఈ రోజు ఆమె ముఖాన విచారం ప్రస్ఫుటంగా కన్పిస్తున్నది. ఒక్కక్షణం ఆమెవైపు చూస్తు నిల్చున్న రాజారావు మనసులో ఒక ఊహ మెరిసింది. ఎలాగైనా ఆమె విచారం పోగొట్టాలని నిశ్చయించుకొని గార్డెన్‌లో ప్రవేశించాడు.

ఆమెతో కేవలం ఒక్కసారిమాత్రం సమావేశంలో పరిచయమైనా, అతను ఎటువంటి సంకోచం లేకుండా ఆమెను సమీపించాడు. కొంతవరకు అతనిలోని సత్సంకల్పం అతనిని ముందుకు నెట్టింది.

“బాగున్నారా?” అని అడిగాడు రాజారావు.

“ఊఁ” అంటూ ఆమె అస్పష్ట మందహాసంతో తలఊపింది.

“అదోమాదిరిగా ఉన్నారు. ఒంట్లో బాగా లేదా?”

“ఏమీలేదండీ, కులాసాగానే వున్నాను” తల వంచుకుని సమాధానం చెప్పింది.

“ఎప్పుడు చూసినా ఏదో దిగులుగావుంటారు. అంతకన్నా నాలుగు రసగుళికలు పుచ్చుకో రాదూ?” నవ్వుతూ అన్నాడు రాజారావు.

“రసగుళికలు...” అంటే ఏమిటన్నట్లు ఆమె ఆశ్చర్యంగా చూసింది అతనివైపు.

“మరేంకాదు, ఉత్సాహంగా ఉండేందుకు డాక్టరుగారి నడిగి నాలుగు మోతాదుల ఆనంద రసం పుచ్చుకోరాదా?”-అని.

ఆమె మళ్ళా తలెత్తి రాజారావువైపు చూసింది. అతను చిరునవ్వు చిందిస్తున్నాడు... ఆమె కళ్ళలో కోపం, సిగ్గూ, రెండూ ప్రతిబింబించినై. రాజారావు ఇంకా మందహాసం చేస్తూనే వున్నాడు. ఆమె తలవంచుకున్నది.

పాలిపోయిన ఆమె చెక్కిళ్లు క్షణికంగా గులాబివర్ణం దాల్చటం రాజారావు స్పష్టంగా చూడకలిగాడు. అతనికి తన సత్సంకల్పం నెరవేరు తుందనే విశ్వాసం కలిగింది.